క్లుప్తంగా

గాంధీకి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు మాకల గాంధీకి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించారు. ఇంపాక్ట్ ఆఫ్ డైరీఫార్మింగ్ ఇన్ జనరేషన్ ఆఫ్ ఇన్‌కమ్ – ఏ స్టడీ ఇన్ రూరల్ తెలంగాణ ఏరియా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మాకల గాంధీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పుష్పలత పర్యవేక్షణలో గాంధీ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

దరఖాస్తుల గడువు పెంచాలి

వరంగల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6గ్యారంటీల అమలు కోసం స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువును నెల రోజులు పెంచాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ ఒక ప్రకటనలో కోరారు. హామీల అమలుకు 6నెలల సమయం అవసరమైనప్పుడు దరఖాస్తులకు కేవలం 10రోజుల గడువు పెట్టడం సరికాదని సూచించారు. అభయహస్తం పథకంలోని అన్నింటికి ఒకే దరఖాస్తు దాఖలు చేయాలనే నిబంధనలు పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికి ఎన్నికల హామీలతో పాటు కొత్త రేషన్‌కార్డులను ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

'అసోసియేషన్ ఆమోదం లేకుంటే సభ్యత్వం రద్దు'

వరంగల్: వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో సభ్యుడై ఉండి సీరియల్ విధానంలో బుకింగ్ చేయకుండా నెల రోజుల పాటు బయట తిరిగే లారీ ఓనర్ల సభ్యత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ తెలిపారు. ఆరెపల్లి వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్‌లో సభ్యుడై ఉండి ఒకసారి సీరియల్ బుకింగ్ చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లి నెలరోజుల పాటు అసోసియేషన్ మొఖం చూడని లారీ ఓనర్ల సభ్యత్వం రద్దు చేయడంతో పాటు అసోసియేషన్‌కు వారికి ఎలాంటి సంబంధం ఉండదని తేల్చిచెప్పారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి ఎండీ.జాకీర్, సలీం, అహ్మద్‌ఖాన్, ఆకుల రాజయ్య, హుస్సేన్ ఖురేషి, అజార్, బోరీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యుడిగా నర్సింగ్‌గౌడ్



కాజీపేట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా కాజీపేట పట్టణానికి చెందిన చిర్ర నర్సింగ్‌గౌడ్‌ను నియమిస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైభవ్ ఆదేశాలు జారీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న నర్సింగ్‌కు రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యుడిగా అవకాశం కల్పించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మతో పాటు పలువురు నర్సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో స్టాండ్ కార్యవర్గం ఎన్నిక

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని ప్రతాపరుద్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ చైర్మన్ ఎండీ.ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ అధ్యక్ష, కోశాధికారి, బ్యాలెట్ ద్వారా, ప్రధాన కార్యదర్శిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొట్ల నర్సింగ్, కోశాధికారిగా భూక్యా శంకర్‌నాయక్‌ను ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పొన్న సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



హసన్‌పర్తి: గుండెపోటుకు గురై మరణించిన బైరాన్‌పల్లికి చెందిన నర్ర కుమారస్వామి కుటుంబానికి మృతుడి బాల్య స్నేహితులు చేయూతనందించారు. ఎస్ఎస్‌సీ 2000–2001వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు.. రూ.82వేల ఆర్థిక సాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి సన్మానం



హన్మకొండ: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు తేళ్ల సుగుణ, మున్నూరు కాపు సంఘం 59వ డివిజన్ కార్యదర్శి తేళ్ల కిశోర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ భవానినగర్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యేకు వారు పుష్పగుచ్ఛం అందించారు.

ఆత్మకూరు : దరఖాస్తులు చూపుతున్న అధికారులు



ఆత్మకూరు : సూచనలు చేస్తున్న ఎంపీపీ సుమలత



నడికూడ : మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్



పరకాల : వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ కమిషనర్



ఇనవోలు : మాట్లాడుతున్న ఎంపీపీ మధుమతి



'ప్రజాపాలన'కు వేళాయె

- వార్డుల వారీగా షెడ్యూల్ విడుదల
- సభలో సమర్పించిన దరఖాస్తులే చెల్లుబాటు
- నేటి నుంచి ఆరు గ్యారంటీల పథకానికి దరఖాస్తుల స్వీకరణ

పరకాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను నెరవేర్చేందుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు అభయహస్తం హామీలో భాగంగా నేటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని వార్డుల వారీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మహాలక్ష్మీ, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల్లో అర్హుల ఎంపికను సెలవు రోజులు మినహాయించి వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధిత నియమాలను ఆయన వెల్లడించారు. వార్డుల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తు ఫారాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒకే దరఖాస్తులో 5 గ్యారంటీలకు సంబంధించిన పథకాల వివరాలు ఉంటాయని, ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలో లబ్ధిదారులు నిర్ణయించుకోవాలని అన్నారు. దరఖాస్తుతో పాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో జతపరుచాలని ఆయన కోరారు. గతంలో గృహలక్ష్మీ పథకంలో ఇళ్లు మంజూరు అయిన వారు కూడా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో రైతుబంధు పొందుతున్న వారు, కౌలు రైతులు కూడా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు సంబంధిత కేసు వివరాలతో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాత పెన్షన్ పొందుతున్న వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. 8 రోజుల పాటు జరిగే ప్రజాపాలన గ్రామ సభలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు దఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

వార్డుల వారీగా గ్రామ సభలు..

నేడు 1 వార్డు (సీఎస్ఐ స్కూల్), 13 వార్డు బస్తీ దవఖానా, 2వ వార్డు (దళిత వాడ ప్రాథమిక పాఠశాల), 19వ వార్డు(సీఎంఎస్ గోదాం), 29న 10వార్డు (ఎంపీపీఎస్ మాదారం), 18వ వార్డు (కొత్త మున్సిపాలిటీ కార్యాలయం), 5వ వార్డు ఉర్దూ మీడియం స్కూల్-బీసీ కాలనీ), 16వ వార్డు (అంబేడ్కర్ భవన్- రాజీపేట), 30న 11వ వార్డు (అంబేడ్కర్ భవన్-మాదారం), 4వ వార్డు(అంబేడ్కర్ భవన్-రాజీపేట), 17వ వార్డు(కొత్త మున్సిపాలిటీ కార్యాలయం), 20 వార్డు(కొత్త మున్సిపాలిటీ కార్యాలయం), జనవరి 2న 7వ వార్డు(పాత గ్రామ పంచాయతీ కార్యాలయం -సీతారాంపూర్), 8వ వార్డు (ఎంపీపీఎస్ సీతారాంపూర్), 6వ వార్డు(పాత గ్రామపంచాయతీ కార్యాలయం-రాజీపేట), 3వ వార్డు(పోచమ్మ గుడి-పద్మశాలివాడ), వచ్చే నెల 3న 9వ వార్డు(చేనేత భవనం -శ్రీనివాసకాలనీ), 15వ వార్డు (ప్రభుత్వ జూనియర్ కళాశాల), 14వ వార్డు(వెలమవాడ ప్రాథమిక పాఠశాల), 12వ వార్డు(గౌడ కమ్యూనిటీ హాల్), 21, 22 వార్డులకు (పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలను కేటాయించారు.

దామెరలో..

దామెర: ప్రజాపాలన గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం గ్రామసభల సన్నాహక సమావేశాన్ని నిర్వహించి ఆమె మాట్లాడారు. ప్రజాపాలన విధివిధానాలను అధికారులకు, సిబ్బందికి వివరించారు. తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో రెండు టీంలుగా విభజించి ప్రతి రోజు రెండు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, ఎంపీఓ రంగాచారి, ఏపీఎం ఝాన్సీ, ఏపీఓ శారద, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, సర్పంచ్ శ్రీరాంరెడ్డి, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా నేడు తక్కళ్లపహాడ్, పసరగొండ, 29న సీతారాంపూర్, ఒగ్లాపూర్, 30న ఊరుగొండ, దామెర, జనవరి 2న కోగిల్వాయి, పులుకుర్తి, 3న సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, 4న దుర్గంపేట్, వెంకటాపూర్, 5న ముస్త్యాలపల్లి దమ్మన్నపేట్‌లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలో నేటి నుంచి ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రవిరాజు, ఎస్సై రాజేష్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. నేడు కొత్తగట్టు, లింగమడుగు, 29న నాగయ్యపల్లె, మల్లక్పేట, 20న ఆత్మకూరు, నీరుకుళ్ల, జనవరి 2న తిరుమలగిరి, కటాక్షపూర్, 3న అక్కంపేట, పెద్దాపూర్, 4న పెంచికలపేట, చౌళ్లపెల్లి, 5న గుడెప్పాడ్, అగ్రంపహాడ్, 6న హౌజ్‌బుజుర్గు, కామారం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు తెలిపారు.

అభయహస్తంపై ఎంపీపీ సమావేశం

మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓపికతో అభయహస్తం దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీపీ మార్క సుమలత అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకం దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి స్వీకరించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఈనెల 28 తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. దరఖాస్తులు అందించేందుకు వచ్చిన ప్రజలకు మంచినీటి వసతి, తదితర వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాంరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీఓ చేతన్‌కుమార్, ఏపీఓ రాజిరెడ్డి ఉన్నారు.



దామెర : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

నడికూడలో..

నడికూడ : ప్రజాపాలనను విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో నేటి నుంచి చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు బాధ్యతయుతంగా పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గుండాల నాగరాజు, ఎంపీఓ సయ్యద్ అఫ్జల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: మండల వ్యాప్తంగా గురువారం నుంచి జనవరి 6వ తేదీన వరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు తెలిపారు. మండల ప్రజాపాలన గ్రామసభల షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. ఈనెల 28వ తేదీన లక్ష్మీపూర్, నేరెళ్ల, మాదన్నపేట, గూనిపర్తి, 29వ తేదీన భీంపల్లి, కన్నూరు, గుండేడు, కొత్తపల్లి, 30వ తేదీన కమలాపూర్, ఉప్పల్, ఉప్పులపల్లి, జనవరి 2న వంగపల్లి, మర్రిపల్లిగూడెం, మర్రిపల్లి, 3న శంభునిపల్లి, కానిపర్తి, 4న గూడూరు, శనిగరం, గోపాల్‌పూర్, 5న అంబాల, శ్రీరాములపల్లి, 6న పంగిడిపల్లి, దేశరాజుపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో ప్రజాపాలన సభలు జరుగుతాయని తెలిపారు. ఈ గ్రామ సభల్లో మహాలక్ష్మి, రైతుభరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ప్రజలు దరఖాస్తు ఫారానికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫొటో జత చేసి ఇవ్వాలన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : నేటి నుంచి జనవరి 6 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మార్నేని మధుమతి కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధుల కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 28న రాంనగర్, లింగమోరిగూడెం, 29న ఉడుతగూడెం, రెడ్డిపాలెం, ఒంటిమామిడిపల్లి, 30న ఐనవోలు, వెంకటాపూర్, జనవరి 2న పంథిని, నందనం, 3న కొండపర్తి, పున్నేలు, 4న గర్మిళ్లపెల్లి, కక్కిరాలపల్లి, 5న ముల్కలగూడెం, నర్సింహుల గూడెం, 6న పెరుమాండ్లగూడెం, వనమాల కనపర్తి గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేక అధికారి డీసీఓ నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటరమణ, ఏఓ అడప కవిత, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆశాలు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ' పనులు పూర్తి చేయాలి

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసేందుకు సబంధించిన పనులు వేగవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అక్కంపేట గ్రామం గతంలో పెద్దాపురం రెవెన్యూ గ్రామంలో ఉన్నప్పుడు అభివృద్ధి లేక కుంటుపడిందన్నారు. అక్కంపేట గ్రామం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అవడం గర్వకారణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవతో అక్కంపేట గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ప్రకటించడం హర్షంచదగిన విషయమన్నారు. ప్రభుత్వం వెంటనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నే బాబురావ్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగారం రవిప్రసాద్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్, డీబీఎఫ్ రాష్ట్ర నాయకుడు కొమ్ముల కరుణాకర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, కుమార్, రవీందర్, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలైన్‌మెంట్ షీట్‌పై అవగాహన కలిగి ఉండాలి

కమలాపూర్: అలైన్‌మెంట్ షీట్‌పై ఉపాధ్యాయులందరు అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ రాంకిషన్‌రాజు సూచించారు. మండలంలోని ఉప్పల్ బాలికల పాఠశాలలో ప్రాథమిక పాఠశాల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను గ్రూపులుగా విభజించి పీరియడ్ ప్లాన్ల ద్వారా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల మాదిరిగా పాఠాలు బోధించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మండల నోడల్ అధికారి శ్రీధర్, కమలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజమల్లయ్య, ఉప్పల్ బాలికల పాఠశాల హెచ్‌ఎం వాణి, ఎస్ఆర్పీలు పవన్‌కుమార్, చంద్రం, డీఆర్పీలు అనురాధ, భిక్షపతి, రాజగోపాల్, రమేష్, సీనియర్ ఆర్పీలు, డీఆర్పీలు ప్రకాష్‌బాబు, రఘుపతి, సీఆర్పీలు సుభాష్, శ్రీనివాస్, మండలంలోని 50 శాతం మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ రాంకిషన్‌రాజు

పాఠశాలను సందర్శించిన సపోర్టింగ్ టీం

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల ఉన్నత పాఠశాలలో బుధవారం ఉన్నతి జిల్లా స్థాయి సపోర్టింగ్ టీం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నతి కార్యక్రమానికి సంబంధించిన బేస్ లైన్ తరగతి గది, రికార్డులు, మోడల్ లెసన్‌లో భాగంగా తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జీహెచ్‌ఎం రామకృష్ణ, ధర్మప్రకాష్, సతీష్, ప్రకాష్, రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న సపోర్టింగ్ టీం

పల్టీ కొట్టిన ట్రాక్టర్.. 13 మందికి గాయాలు

ఐనవోలు: ట్రాక్టర్ పల్టీ కొట్టి 13 మందికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లం మర్రెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం 16 మంది కూలీలను తన స్వంత ట్రాక్టర్‌లో వ్యవసాయ పనులకు తీసుకెళ్లాడు. కూలీ పనులు పూర్తయిన అనంతరం ట్రాక్టర్‌లో ఎక్కించుకుని గ్రామానికి చేరుకునే క్రమంలో ట్రాక్టర్ టైర్‌లో గాలి దిగడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. మర్రెడ్డితో పాటు ఆయన భార్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.



లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

దామెర: లోక్‌అదాలత్‌ను వినియోగించుకుని కేసులు పరిష్కరించుకోవాలని ఎస్సై కొంక అశోక్ బుధవారం ఒక ప్రకటలో కోరారు. డ్రంక్‌అండ్‌డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించి వాహనాలు సీజ్ అయిన వారు ఈనెల 30వ తేదీ వరకు పరకాల కోర్టులో నిర్వహించనున్న లోక్‌అదాలత్‌కు హాజరై కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎస్సై నంబర్ 8712685228ను గాని కోర్టు కానిస్టేబుల్ సెల్ నెంబర్ 9849336971ను సంప్రదించాలని కోరారు.

కేజీబీవీ విద్యార్థులకు అవగాహన సదస్సు



ఐనవోలు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మానసిక నిపుణురాలు డాక్టర్ జి.విశాలాక్షి, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు తక్కల్లపల్లి వినుతారావు విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు పట్టుదల, కృషిపై పురోగతి సాధన అనే అంశాలను వివరించారు. పాఠశాల స్థాయిలో పట్టుదల నిరంతర శ్రమతో తమ కళలు సాకారం చేసుకోవాలని, విద్యపై శ్రద్ధాసక్తిని, ఇష్టాన్ని పెంచుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఎస్ఓ కోటగిరి సునీత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హాజరు కానున్న ఎమ్మెల్యే

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని నేడు మండలంలో ప్రారంభించేందుకు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. దరఖాస్తులు చేసుకునే లబ్ధిదారులు సంయమనం పాటించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఘనంగా యవ్వస్తుల వేడుకలు

పరకాల: మండలంలోని మల్లక్‌పేట సీఎస్ఐ పరకాల మిషన్ సెంటినరీ ప్రార్థన మందిరంలో బుధవారం యవ్వస్తుల వేడుకలను (పరకాల ప్రాంతంలో సీఎస్ఐ 100 సంవత్సరాల ఉత్సవాలు) ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆ సంస్థ చైర్మన్ ప్రతీష్‌బాబు కురైన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సీఎస్ఐ సంఘ పెద్దలు జెన్నీ క్రిస్టోఫర్ (ఐఈఎం-బెంగుళూర్), బి.శ్యాం సుకుమార్ (యూపీఎఫ్-తెలంగాణ) హాజరై ప్రసంగించారు. కేరళ ప్రాంతం నుంచి క్రీస్తు ప్రేమను ప్రకటించటానికి 1924 సంవత్సరంలో మిషన్ పరిచర్యలో భాగంగా వచ్చి అనేక ప్రాంతాల్లో విద్య, వైద్య, సామాజిక సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. నేటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. పాస్టర్ రూబెన్, సీఎస్ఐ తెలంగాణ మిషన్, పరకాల, కాత్రపల్లి సంఘాల పాస్టర్‌లు, యవ్వస్థులు, స్థానికులు పాల్గొన్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ

ఐనవోలు : తెలంగాణలోని వివిధ జిల్లాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ 2023–24 క్రీడల్లో మండల కేంద్రంలోని ఏకశిల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంచిర్యాలలో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మండలానికి చెందిన 8వ తరగతి విద్యార్థి జి.సామ్యూల్‌జాన్ అండర్ 14 విభాగం రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకోగా, 9వ తరగతి విద్యార్థిని జి.హస్విత ద్వితీయ స్థానంలో నిలిచింది. కాగా వీరు త్వరలో న్యూ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో స్పీడ్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వహించిన బ్యాడ్మింటన్ గేమ్ అండర్ 17 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ హన్సిక, జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించగా మహబూబ్‌నగర్‌లో జరిగిన ఫుట్‌బాల్ క్రీడలో ముగ్గురు, కామారెడ్డిలో జరిగిన హాకీ క్రీడల్లో ఇద్దరు, వనపర్తి జిల్లాలో జరిగిన హాకీ అండర్ 17లో ముగ్గురు, రంగారెడ్డిలో అండర్ 14 నెట్‌బాల్‌లో తొమ్మిది మంది, అండర్ 17లో ఏడుగురు, కేయూ హనుమకొండలో జరిగిన సాఫ్ట్‌బాల్ క్రీడల్లో అండర్ 14 విభాగంలో ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయిలో గెలిచి, రాష్ట్ర స్థాయి క్రీడలకు వెళ్లారని చెప్పారు. కాగా విజేతలను మెమొంటో అందించి అభినందించి పీఈటీలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఇన్‌చార్జ్ ఎండీ బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవికిరణ్, నర్సయ్య, నరేష్, రవీందర్, రాజేష్, శిరీష, అనూష తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపుతున్న తిరుపతిరెడ్డి

బాధిత కుటుంబాలకు ప్రముఖుల పరామర్శ



ఐనవోలు : పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు: మండలంలో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన తాటికాయల ప్రమీల, ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన గోనె మధు, పున్నేలు గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్జల్ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీకోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, నాయకులు మునిగాల సమ్మయ్య, రాజు, కల్పన, మధుకర్, అరుణ్, నాయకులు తదితరులు ఉన్నారు.



ధర్మసాగర్ : పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కడియం

కడియం పరామర్శ

ధర్మసాగర్ : హసన్‌పర్తి మండలం బాహుపేట్ క్రాస్ రోడ్డు వద్ద కరీంనగర్-హనుమకొండ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ బొడ్డు శోభ భర్త, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డు సోమయ్య (55), అతని సోదరుడు బొడ్డు సుదర్శన్ (58) మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జెడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో పాటు పలువురు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వారి మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.